

గుట్టుగా గుడుంబా తయారీ - 8లో..
ధాన్యానికి బోనస్ చెల్లించాలి - 8లో..

# నకిలీ భయం

- పత్తి విత్తనాల గుర్తింపులో రైతుల అయోమయం
- గ్రామాల్లో నకిలీ విత్తన వ్యాపారుల మంతనాలు
- ఏటా తనిఖీలు.. ఆగని దందా
- బీటీ 3 విత్తనాలపైనే రైతుల ఆసక్తి
- పొరుగు రాష్ట్రాల నుంచి జిల్లాలోకి
- జిల్లాలో 2.35 లక్షల ఎకరాల్లో వానాకాలం సాగు
- పత్తి 49,215 ఎకరాలు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

నకిలీ విత్తనాలు అన్నదాతలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. నాసిరకం విత్తనాలకు అడ్డుకట్ట వేసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నా దందా కొనసాగుతోంది. ప్రస్తుతం జిల్లాలో వానాకాలం పంటలకు రైతులు సన్నద్ధమవుతున్నారు. జిల్లాలో వానాకాలం సీజన్‌లో 2.35 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అంచనాలు వేసింది. ఇందులో ప్రధానంగా వరి 1.83 లక్షలు, పత్తి 49,215 ఎకరాల్లో సాగు చేయడానికి సిద్ధమయ్యారు. వానాకాలం సీజన్‌లో ప్రధానంగా పత్తి సాగు చేసే రైతులను నకిలీ విత్తనాల భయం వెంటాడుతూనే ఉంది. ఇప్పటికే జిల్లాలోని పలు గ్రామాల్లో పొరుగు రాష్ట్రాలకు చెందిన పత్తి విత్తన వ్యాపారుల ఏజెంట్లు పల్లెల్లో తిరగడం మొదలు పెట్టినట్లు తెలిసింది. జిల్లాలో ఏటా నకిలీ విత్తనాల దందాపై నిఘా పెడుతూ విత్తనాలను స్వాధీనం చేసు కుంటున్న విత్తనాల దందా మాత్రం ఆగడం లేదు. వానాకాలం సాగు ప్రణాళికపై వ్యవసాయ అధికారులు నకిలీ విత్తనాలపై రైతుల్లో అవగాహన కల్పించడంలో విఫలమవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. టాస్క్‌ఫోర్స్, పోలీసులు పలు గ్రామాలపై దృష్టిసారించినా గుట్టు చప్పుడు కాకుండా విత్తనాలు వస్తునే ఉన్నాయి. నకిలీ విత్తనాల అమ్మకం దారులపై కేసులు నమోదు చేస్తున్నా విత్తనాల ప్రవాహాన్ని మాత్రం ప్రభుత్వం నిరోధించలేకపోతోంది.

### పొరుగు రాష్ట్రాల నుంచి నకిలీ విత్తనాలు

రాజన్న సిరిసిల్ల జిల్లాకు పొరుగున మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ ఉండడంతో అక్రమ వ్యాపారులు అక్కడ కేంద్రంగా చేసుకొని నకిలీ విత్తనాలను జిల్లాలోని గ్రామాల్లో రైతులకు అంటగడుతున్నారు. బ్రాండెడ్ విత్తనాల కంపెనీల కంటే నాణ్యతగల విత్తనాలను తక్కువ రేటుకు ఇస్తున్నామని నమ్మించి మోసం చేస్తున్నారు. మార్కెట్‌లోకి వస్తున్న విత్తనాలు, ఏవి అసలు, ఏవి నకిలీవో పోల్చుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. నకిలీ విత్తనాలతోపాటు వ్యాపారులు నిషేధిత బీటీ 3 పత్తి విత్తనాలను ఆంధ్రా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ నుంచి జిల్లాకు రహస్యంగా తెప్పించుకుంటున్నారు. ఇక్కడ కవర్లను మార్చి ప్యాకింగ్ చేసి ద్విచక్రవాహనాల ద్వారా రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి అమ్మకాలు సాగిస్తున్నారు. రైతులు చీడ పీడలను తట్టుకునే విధంగా నిషేధిత బీటీ 3 పత్తి విత్తనాలపైనే ఆసక్తి చూపుతున్నారు. కలుపు నివారణ లేకుండా దిగుబడి వచ్చే అవకాశం ఉండడంతో గ్రామాలకు వస్తున్న ఏజెంట్ల ద్వారా విత్తనాలు కొంటున్నారు. 750 గ్రాముల బీటీ 3 పత్తి విత్తనాల ప్యాకెట్ రూ.800 నుంచి రూ.1200 వరకు అమ్ముకుంటున్నారు. సీజన్ కంటే ముందు నిషేధిత, నకిలీ పత్తి విత్తనాలు గ్రామాలకు ముందే చేరుకుంటున్నాయి.



పత్తి సాగుకు దుక్కులు దున్నిన రైతులు

### విత్తన డీలర్లపై నిఘా

ప్రతీ సీజన్ ప్రారంభంలో రైతులకు విత్తనాల కొనుగోలే సమస్యగా కనిపిస్తోంది. డీలర్లు ఏ విత్తనాలు ఇస్తున్నారో తెలియని పరిస్థితి ఉండడంతో విత్తన డీలర్లపై ప్రత్యేక నిఘా పెట్టి వ్యవసాయ శాఖ ప్రత్యేక ఐడీలను ఇచ్చింది. కొత్త విధానాలు అమల్లోకి తెచ్చింది. ప్రత్యేక యాప్ ద్వారా విత్తనాల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. కొత్త విధానాలతో ఎలాంటి విత్తనాలు అమ్ముతున్నారు? ఎక్కడి నుంచి తెస్తున్నారు? అనే వివరాలు కూడా ఎప్పటికప్పుడు తెలుసుకునే వీలు ఉంటుంది.



జిల్లాలో పట్టుకున్న నకిలి పత్తి విత్తనాలు (ఫైల్)

### తగ్గనున్న పత్తి సాగు

గతేడాది కంటే ఈసారి పత్తి సాగు గణనీయంగా పడిపోతోందని అంచనాలు వేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నుంచి జలాలు వచ్చే పరిస్థితులు లేకపోవడం, వర్షాలు ఎలా ఉండబోతున్నాయనే తెలియని పరిస్థితుల్లో రైతులు ఈ సారి పత్తి సాగు తగ్గించుకున్నట్లు తెలుస్తోంది. గత సంవత్సరం వరకు జిల్లాలో పత్తి సాగు 80 నుంచి లక్ష ఎకరాల వరకు సాగు చేసేవారు. ఈసారి జిల్లాలో 49,215 ఎకరాల వరకే సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. మరోవైపు విత్తనాల భారం కూడా పడింది. పత్తి విత్తనాల బ్యాగులపై రూ.11 వరకు ధర పెరిగింది. దీంతో జిల్లాలో పత్తి రైతులపై రూ.10 లక్షల అదనపు భారం పడుతోంది. 450 గ్రాముల బరువు ఉండే విత్తన ప్యాకెట్ ధర రూ.850 నుంచి రూ.864కు పెరిగింది.

### వానాకాలం సాగు లెక్క ఇలా..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో వానాకాలంలో 2 లక్షల 35 వేల 866 ఎకరాల్లో వివిధపంటలు సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అంచనాలు వేసింది. ఇందులో వరి లక్షా 83వేల 80 ఎకరాలు, పత్తి 49,215 ఎకరాలు, పెసర 348 ఎకరాలు, కందులు 1502 ఎకరాలు, మొక్కజొన్న 1510 ఎకరాలు, సోయా చిక్కుడు 5 ఎకరాలు, ఎర్ర మిర్చి 180 ఎకరాలు, మినుములు పది ఎకరాలు, జొన్నలు పది ఎకరాలు, ఆముదం 6 ఎకరాల్లో సాగు చేస్తారని అంచనా వేశారు. ఇందుకోసం వరి 45,770 క్వింటాళ్ల విత్తనాలు, అవసరం అవుతాయని అంచనా వేయగా కందులు 45.06 క్వింటాళ్లు, మొక్కజొన్న 120 క్వింటాళ్లు, పత్తి 665 క్వింటాళ్లు, సోయాచిక్కుడు 1.50 క్వింటాళ్లు, మిర్చి విత్తనాలు 18 కిలోలు, పెసర్లు 27.84 క్వింటాళ్లు, మినుములు 80 కిలోలు, జొన్నలు 40 కిలోలు అవసరం అవుతాయని అంచనా వేశారు. సాగుకు సంబంధించి 2.35 లక్షల ఎకరాల్లో వేసే వివిధ పంటలకు ఎరువులు 49,441 మెట్రిక్ టన్నులు అవసరం అవుతాయని అంచనా వేశారు. యూరియా 22,484 మెట్రిక్ టన్నులు, డీఏపీ 4328 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 14,839 మెట్రిక్ టన్నులు, ఎంవోపీ 5936 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పీ 1855 మెట్రిక్ టన్నులు అవసరం అవుతాయని అంచనాలు వేశారు.

### నిరాశపర్చిన రుణ పరిమితి

పంటల రుణ పరిమితి ప్రణాళికా ఈ సంవత్సరం నిరాశ పర్చింది. రాష్ట్ర స్థాయి సాంకేతిక కమిటీ 124 పంటలకు సంబంధించి రుణ పరిమితి పెంచినా గత సంవత్సరంతో పోలిస్తే యథాతదంగానే ఉంది. పత్తి రైతులకు వెయ్యి రూపాయాలు మాత్రమే పరిమితి పెరిగింది. వరికి ఏప్పటిలాగానే రూ.43 వేల నుంచి రూ.45 వేల వరకు మాత్రమే ఉంచారు. ఈసారి రాజన్న సిరిసిల్ల జిల్లాలో 2024 - 25 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకర్ల ద్వారా వ్యవసాయ రుణాలు 2137.42 కోట్లు ఇవ్వాలనే లక్ష్యంగా నిర్ణయించారు.

## ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

తంగళ్లపల్లి, మే 16: ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తంగళ్లపల్లి మండలం మండెపల్లి ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ జి. కనకయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఐటీఐలో 2024-25/26 విద్యా సంవత్సరానికి మొదటి విడత దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఈ నెల 16వ తేదీ నుంచి జూన్ 10వ తేదీ వరకు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. వివరాల కోసం ఐటీఐలో సంప్రదించాలని సూచించారు.

## జేఎన్‌టీయూ అసోసియేట్ ప్రొఫెసర్ దేవేందర్‌కు డాక్టరేట్



హైదరాబాద్ సిటీ, మే 16 (ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఇంజనీరింగ్ కాలేజీ మెకానికల్ విభాగంలో సహాయ ఆచార్యుడిగా పనిచేస్తున్న జి.దేవేందర్‌కు పీహెచ్‌డీ ప్రదానం చేస్తూ యూనివర్సిటీ పరీక్షల విభాగం డైరెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. 'ఆప్టిమైజేషన్ ఆఫ్ మాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్.. పారామీటర్స్ ఆఫ్ సిలిండ్రికల్ కప్ యూజింగ్ నికెల్ అల్లాయిడ్స్ బై డీప్ డ్రాయింగ్' అంశంపై దేవేందర్ డాక్టరేట్ పొందారు. మెకానికల్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ చెన్నకేశవరెడ్డి గైడ్‌గా వ్యవహరించారు. డాక్టర్ దేవేందర్ మాట్లాడుతూ.. పరిమితి రేఖా చిత్రాలను రూపొందించడం, షీట్ మెటల్ ప్రవర్తనను అంచనా వేయడానికి, ఉత్పత్తి రంగంలో తన పరిశోధన ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. న్యూక్లియర్ ఇంజనీరింగ్ రేడియేషన్ వాతావరణంలో అద్భుతమైన ప్రతిఘటన కారకంగా, ఉష్ణ నిరోధకాల తయారీకి ఉపయోగపడుతుందని తెలిపారు. దేవేందర్ స్వస్థలం రాజన్న సిరిసిల్ల జిల్లా, కొండాపూర్ గ్రామం. ఆయనకు పలువురు ఆచార్యులు, ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

## ఈత, తాటి చెట్ల తొలగింపు.. పరిశీలించిన అధికారులు



తొలగించిన చెట్లను పరిశీలిస్తున్న ఎక్సైజ్ అధికారి

ఎల్లారెడ్డిపేట, మే 16: ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామ శివారులోని పెనిమడుగు కాలువ ప్రాంతంలో ఉన్న ఈత, తాటి చెట్లను తొలగించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆ గ్రామ గౌడ సంఘం సభ్యులు గురువారం మండల కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయంలో అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామ శివారులోని పెనిమడుగు కాలువ సమీపంలోని ఈత, తాటి చెట్ల నుంచి కల్లు తీస్తూ జీవిస్తున్నామని పేర్కొన్నారు. గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేటకు చెందిన వ్యక్తి జక్కు భూమయ్య ఈ నెల 15న రాత్రి జేసీబీతో తొలగించాలరని ఫిర్యాదులో పేర్కొన్నారు. అతడిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలోని సిబ్బంది గ్రామానికి చేరుకుని తొలగించిన చెట్లను పరిశీలించారు. జక్కు భూమయ్యపై చర్యలు తీసుకుంటామని సీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. గౌడ సంఘం నాయకులు మల్లేశంగౌడ్, దేవరాజుగౌడ్, మహేందర్, శ్రీనివాస్, నారాయణ, పర్శయ్య తదితరులు ఉన్నారు.

## పరికరాలు ఇలా.. వ్యాయామం ఎలా?



విరిగిపోయి కింద పడిన జిమ్ పరికరం

ఎల్లారెడ్డిపేట, మే 16: ప్రజలకు ఆహ్లాదంతోపాటు ఆరోగ్యంగా అందాలనే లక్ష్యంతో ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని గిద్దె చెరువు ప్రాంతంలోని పల్లె ప్రకృతి వనంలో ఏర్పాటు చేసిన జిమ్ పరికరాలు విరిగిపోయాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పరికరాలు విరిగి వ్యాయమం చేసేందుకు వీలు లేకుండాపోతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించాలని, జిమ్ పరికరాలను బిగించాలని స్థానికులు కోరుతున్నారు.

## మహిళల స్వయం ఉపాధిపై దృష్టి సారించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, మే 16 : స్వయం ఉపాధి కోసం మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు నూతన వ్యాపారాలను ప్రారంభించేలా అధికారులు చర్యలను చేపట్టాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో గురువారం స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థిక అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతన ఆలోచనలతో మహిళలు వివిధ రకాల వ్యాపారాలను ప్రారంభించి ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం తరుపున సంపూర్ణ సహకారం అందజేయాలన్నారు. నూతన వ్యాపారాలు ప్రారంభించేలా మహిళలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్వయం సహాయ సంఘాలకు బ్యాంకుల నుంచి అందించే రుణాలు సద్వినియోగ చేసుకోనేలా చర్యలు తీసుకోవాలన్నారు. వాటితో వ్యాపారాలు ప్రారంభించి ఆర్థికంగా ప్రగతిని సాధించే దిశగా మహిళలకు అవసరమైన శిక్షణను అందించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న మహిళా సంఘాల స్థితిగతులపై ముందస్తుగా సర్వేలు చేయించాలన్నారు. మహిళలు ప్రస్తుతం చేస్తున్న పని వారికి ఉన్న నైపుణ్యాలు వారి ఆసక్తి ప్రకారం వివిధ రంగాల కింద మహిళలను విభజించి వారికి అవసరమైన శిక్షణ కార్యక్రమాలను ఇవ్వడానికి ప్రణాళికలను రూపొందించుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వాలు అందించే పథకాలను వినియోగించుకొని బ్యాంకర్లతో సమన్వయం చేసుకోవాలని, నూతన వ్యాపార యూనిట్లు మహిళలు ప్రారంభించే విధంగా చూడాలని సూచించారు. ప్రస్తుతం మార్కెట్‌లో డిమాండ్ ఉన్న వ్యాపార అవకాశాలు ఉపాధి మార్గాల సంబంధిత అధికారులకు నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆహార పరిశ్రమలు, పచ్చళ్లు, అగర్‌బత్తీలు, సబ్బుల తయారీ సింగిల్ యూసేజ్ ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ బట్టసంచుల తయారీ మార్కెట్‌లో డిమాండ్ ఆధారిత వస్తువులు, ఆన్‌లైన్ విధానం ద్వారా వివిధ రకాల సేవలు వంటివాటిపై అధికారులకు వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, రాష్ట్ర మెప్మ కో ఆర్డినేటర్ పద్మ, ప్రమోద్‌కుమార్, శరత్, మున్సిపల్ కమిషనర్లు లావణ్య, అవినాష్, లీడ్‌బ్యాంక్ మేనేజర్ మల్లికార్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

## నాణ్యత కూలింది.. మురుగు నిలిచింది



ధ్వంసమైన డ్రైయినేజీ

ఎల్లారెడ్డిపేట, మే 16: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామంలోని అంబేద్కర్‌నగర్ కాలనీలో మురుగు నీటి కాలువ గతేడాది కురిసిన భారీ వర్షాలకు ఎగువ ప్రాంతం నుంచి ప్రవహించిన వరదకు కూలిపోయింది. నిర్మాణ పనుల్లో నాణ్యత లేకపోవడంతో ఆరు నెలలకే కొట్టుకుపోయింది. ప్రజాప్రతినిధి పనులు చేయడంతో అధికారుల పర్యవేక్షణ లేకుండాపోయింది. ఫలితంగా నాణ్యత కూలి మురుగు నిలుస్తోంది. డ్రైయినేజీ ఓ వైపు కూలిపోవడంతో మురుగు నీరు ఓ చోట చేరి దుర్గంధం వెదజల్లుతోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈగలు, దోమలు వృద్ధి చెంది జ్వరాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకుని ధ్వంసమైన మురుగు నీటి కాల్వ మరమ్మతు పనులు చేసి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

## అధికారుల నిర్లక్ష్యం.. మొక్కలకు శాపం

- ఎండుతున్నా పట్టించుకోని అధికారులు



మూడపల్లిలో రోడ్డు పక్కన ఎండిన మొక్కలు

చందుర్తి, మే 16 : చందుర్తి మండల పరిధిలోని మర్రిగడ్డ, మూడపల్లి గ్రామాల్లోని కోరుట్ల- వేములవాడ ప్రధాన రహదారికి ఇరువైపులా రోడ్డు వెంట నాటిన మొక్కలు అధికారుల పర్యవేక్షణ లేక పూర్తిగా ఎండిపోయాయి. హరితహారంలో భాగంగా మూడపల్లి వేంకటేశ్వర స్వామి గుడి నుంచి మర్రిగడ్డలోని పెట్రోల్ బంక్ వరకు ప్రధాన రహదారి వెంట నాటిన మొక్కలు కూడా పూర్తిగా ఎండిపోయాయి. మొక్కల సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన ఊతకర్రలు, ట్రీగార్డులు మాత్రమే ప్రస్తుతం దర్శనమిస్తున్నాయి. మొక్కలు మోడువారి నెలలు గడుస్తున్నా అధికారులు దృష్టిసారించడం లేదు. ఇప్పటికైనా వాటి స్థానంలో కొత్తగా మొక్కలు నాటి సంరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.



మర్రిగడ్డలో మొక్కల సంరక్షణ కోసం ఊత కర్రలు

# ఉరుములు, మెరుపులతో భారీ వర్షం

- జలమయమైన సిరిసిల్ల
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం



జిల్లా కేంద్రంలో నిలిచిన వర్షం నీరు

సిరిసిల్ల రూరల్, మే 16 : జిల్లా కేంద్రంలో గురువారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులు, ఈదురుగాలతో ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం 3గంటలనుంచి సాయంత్రం 4 వరకు గంటపాటు కురిసిన భారీ వర్షానికి పట్టణంలోని పాత బస్టాండ్, సర్దార్‌నగర్, సంజీవయ్యనగర్, అనంతనగర్, ఆటోనగర్‌లలో రోడ్లపై భారీగా వర్షం నీరు చేరింది. రోడ్లన్నీ జలమయం అయ్యాయి. పాత బస్టాండ్‌లోని ప్రధాన రోడ్డుపై పార్క్ చేసిన వాహనాల వద్ద భారీగా నీరు నిలిచింది. అంతేకాకుండా వీచిన ఈదురుగాలికి హోర్డింగ్‌లపై ఫ్లెక్సీలని చిరిగి కింద పడడంతోత్రుటిలో ప్రమాదాలు తప్పింది. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ శివారులోని తుర్కాకాశీకాలనీలో ఈదురుగాలులకు చెట్లు విరిగి ఇళ్లపై పడిపోవడంతోత్రుటిలో ప్రాణాపాయం తప్పింది.

### కోనరావుపేటలో..

కోనరావుపేట: కోనరావుపేట మండలంలో గురువారం ఉరుములు మెరుపులుతో కూడిన వర్షం కురిసింది. దీంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని కాపాడుకోవడానికి రైతులు ఇబ్బందులు పడ్డారు. ధాన్యం పైన కప్పిన కవర్లు కొట్టుకపోవటంతో తడిసి ముద్దయ్యింది. పది రోజులుగా ఆకాశం మబ్బులు కమ్ముకోవడంతో ఉదయం ధాన్యాన్ని ఎండబెట్టుకోవడం, సాయంత్రం ధాన్యంపై కప్పులు కప్పుకోవడంతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు తెలిపారు. అధికారులు స్పందించి వెంటనే కొనుగోలు చేస్తే ఇబ్బందులు ఉండేవి కావని పేర్కొంటున్నారు.



కవర్లపై నిలిచిన వర్షపు నీరు



ధాన్యంపై కవర్ కప్పుతున్న రైతు

**చందుర్తి :** చందుర్తి మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో గురువారం కురిసిన అకాల వర్షానికి కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం రాశుల కిందకు నీరు చేరింది. కాంటాలు వేసిన ధాన్యం బస్తాలు పాక్షికంగా తడిసిపోయాయి. ఆయా గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో 100కు పైగా ధాన్యం రాశులు ఉన్నాయి. ధాన్యం రాశుల కిందకు మాత్రమే నీరు చేరింది. ఆకాశం మబ్బులు పట్టి ఉండడంతో ధాన్యం రాశులను ఆరబెట్టేందుకు రైతులు ముందుకు రాలేదు. ధాన్యం రాశుల కుప్పలపై కప్పిన టార్పలిన్ కవర్లపై వర్షం నీరు నిలిచింది. వర్షం కురవడంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం వేయలేదు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కొనుగోలు వేగవంతం చేయాలని రైతులు కోరారు.













# పిడుగుపాటుకు ఇద్దరు రైతుల మృతి


శ్రీనివాస్, చంద్రయ్య(ఫైల్)

తంగళ్లపల్లి, మే 16: రాజన్న సిరిసిల్ల జిల్లాలో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో పాటు పిడుగులు పడడంతో ఇద్దరు రైతులు మృతి చెందారు. మరో నలుగురు గాయపడ్డారు. తంగళ్లపల్లి మండలం ఇందిరానగర్ గ్రామం భరత్‌నగర్‌కు చెందిన రైతు రుద్రారపు చంద్రయ్య(42) పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందాడు. గురువారం సాయంత్రం తన ఇంటి దగ్గరలోనే ఉన్న పోలంలో రైతు చంద్రయ్య పనులు నిర్వహిస్తుండగా ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో పిడుగు మీద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానిక రైతులు గమనించి అసుపత్రికి తరలించాడానికి ప్రయత్నించగా అప్పటికే మృతి చెందడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

**వేములవాడ టౌన్:** వేములవాడలో కురిసిన అకాల వర్షానికి పిడుగు పడి ఓ యువ రైతు మృతి చెందిన సంఘటన మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లి గ్రామంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం శాత్రాజుపల్లి గ్రామానికి చెందిన రేగుల దేవయ్య, రేగుల శ్రీనివాస్, కంబళ్ల కొమురవ్వ, కంబళ్ల శ్రీనివాస్, కంబళ్ల ఎల్లయ్యలు చింతచెట్టుకు చింతకాయ కొట్టేందుకు వెళ్లారు. భారీ ఈదురుగాలులతో కూడిన వర్షంతో పిడుగు పడింది. దీంతో కంబళ్ల శ్రీనివాస్ (30) మృతి చెందగా రేగుల దేవయ్య, రేగుల శ్రీనివాస్, కొమురవ్వ, ఎల్లయ్యలు తీవ్రంగా గాయపడ్డారు. హుటాహుటిన వేములవాడని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుడికి భార్య, రెండు నెలల పసిబిడ్డ ఉన్నట్లు తెలిపారు.













● గంజాయి మత్తులో యువకుల ప్రమాదకర విన్యాసాలు

● ర్యాష్ డ్రైవింగ్‌లతో బెంబేలెత్తుతున్న వాహనదారులు, ప్రజలు

**అర్జున్.. నైట్ డ్యూటీ ముగించుకుని నగర శివారులో ఉండే తన ఇంటికి బైక్‌పై వెళుతున్నాడు. ఇంతలో ఓ బైక్ రయ్‌మని అతడి పక్కనుంచి దూసుకుపోయింది.. భయపడ్డ అతను తేరుకునేలోపై మరో బైక్ పెద్ద శబ్దంతో అంతకంటే వేగంగా వెళ్లింది. అలా నాలుగు బైక్‌లు వెళ్లాయి.. అప్పుడు అర్థం అయ్యింది అతడికి అక్కడ బైక్ రేసింగ్ జరుగుతోందని.. కరీంనగర్ శివార్లలోని రోడ్లపై కొందరు యువకులు అర్ధరాత్రి దాటిన బైక్ రేస్‌లు నిర్వహిస్తున్నారు. ప్రమాదకర విన్యాసాలు చేస్తూ ప్రజలను, వాహనదారులను భయాందోళనకు గురి చేస్తున్నారు. కొన్నిసార్లు ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారు. పోలీసులు ఈ విషయంపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.**

కరీంనగర్ క్రైం, మే 16: కరీంనగర్‌లో కొందరు యువకులు రాత్రి సమయాల్లో బైక్ రేస్‌లు నిర్వహిస్తూ నగరంలోని ప్రధాన రోడ్లు, నగర శివారులో బైపాస్ రోడ్లపై బైక్ రేస్‌లు జరుగుతున్నాయి. యువకుల ప్రమాదకర విన్యాసాలతో వాహనదారులు, ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కరీంనగర్ శివారులోని బొమ్మకల్ బైపాస్‌రోడ్, పెద్దపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి, రేకుర్తి బైపాస్ రోడ్డు, మానేరు బైపాస్‌రోడ్, ఎల్ఎండీ రిజర్వాయర్ కట్టపై, చింతకుంట-మల్కాపూర్ బైపాస్ రోడ్, విద్యానగర్-శాతవాహన యూనివర్సిటీ రోడ్లపై ఇష్టారాజ్యంగా బైక్ రేసులు జరుగుతున్నాయి.

## ప్రమాదాలతో భయాందోళనలు

రెండు రోజుల క్రితం భగత్‌సింగ్ చౌరస్తా నుంచి బైపాస్‌రోడ్‌కు వెళ్లే మార్గంలో బైక్ రేస్‌కు పాల్పడుతున్న యువకుల్లో ఒకరి బైక్ దారిన పోతున్న వాహనాన్ని బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో బాధితుడి కాలు విరిగి తీవ్ర గాయాలుకాగా యువకులు బైక్‌ను అక్కడే వదిలేసి పరారయ్యారు. బాధితుడికి ఒక ఆసుపత్రిలో శస్త్రచికిత్స జరిగింది. దీనిపై కరీంనగర్ రెండో ఠాణాలో బాధితులు ఫిర్యాదు చేశారు. రాంచంద్రాపూర్ కాలనీ వద్ద బైపాస్ రోడ్‌లో రాత్రి సమయంలో కొందరు యువకులు ఒక గ్యాంగ్‌గా ఏర్పడి గంజాయి సేవిస్తూ నిత్యం బైక్ రేస్‌లు నడుపుతున్నారని స్థానికులు చెబుతున్నారు.

కొందరు యువకులు రోడ్లపై చేస్తున్న ర్యాష్ డ్రైవింగ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్, సెల్ రైడింగ్, సడన్‌బ్రేక్, ఓవర్‌టేక్, త్రిబుల్ రైడింగ్‌ల వల్ల వాహనదారులు భయాందోళనలకు గురవుతున్నారు. ఒకరు చేసిన పొరపాటుతో ప్రమాదాలు జరిగి పలువురు ఇబ్బంది పడుతున్నారు. ఎటువంటి తప్పిదం లేని పాదచారులు, వాహనదారులు ఎదుటి వాహనదారుల తప్పిదాలతో ప్రమాదాలబారిన పడుతుండటం ఆందోళనను కలిగిస్తున్నది.

కొద్ది నెలల కిందట చింతకుంట బైపాస్ రోడ్‌లో బైక్ రేస్‌లో పాల్గొన్న యువకులు బైక్ అదుపుతప్పి కిందపడడంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. అంతకు ముందు కరీంనగర్ కోర్టు చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు బైక్ రేస్ చేస్తున్న రెండు బైక్‌లు అర్ధరాత్రి సమయంలో రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టగా ఇద్దరు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మరొక ప్రమాదం లో మానేరు బైపాస్‌రోడ్‌లో ఒక యువకుడు మృతి చెందాడు. ఇలా తరచుగా ప్రమాదాల బారినపడి యువకులు మృత్యువాత పడుతున్నారు. ఖరీదైన బైక్‌లతో యువకులు బైక్ రేస్‌కు పాల్పడుతూ విలువైన ప్రాణాలను కోల్పోతున్నారు.

## ప్రాణాలు తీస్తున్న అతివేగం

బైక్ రేస్‌లలో పాల్గొనే యువకులు ఇటీవల గంజాయి మత్తుకు బానిసలవుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. కొందరు యువకులు రయ్..రయ్..మంటూ ర్యాష్ డ్రైవింగ్, రాంగ్ డ్రైవింగ్, జిగ్‌జాగ్ డ్రైవింగ్‌తో నగరంలోని రోడ్లపై ట్రాఫిక్ సిగ్నల్స్‌ను లెక్కచేయకుండా పక్కనున్న వాహనదారుల గుండెల్లో గుబులురేపుతున్నారు. ఇటువంటి వాహనదారులను పట్టుకోవడం ట్రాఫిక్ పోలీసులకు కూడా కష్టంగా మారింది. అతివేగంగా వాహనాలను నడపటం యువతకు ఒక ఫ్యాషన్‌గా తయారైంది. ఈ అతివేగమే వారి ప్రాణాల మీదికి వస్తున్నది. అతివేగంతో వాహనాలు నడుపుతున్న యువత ఆ వేగాన్ని నియంత్రించే క్రమంలో ఆందోళనకు గురై సడన్‌బ్రేక్‌లు వేయటం, అడ్డదిడ్డంగా వెళ్లటంతో ప్రమాదాలబారినపడుతున్నారు. కరీంనగర్‌లో అర్ధరాత్రి సమయంలో ర్యాష్ డ్రైవింగ్, అధిక శబ్దంతో వాహనాలను నడపడం ఇటీవలి కాలంలో ఎక్కువగా జరుగుతున్నది. పోలీసులు ఈ విషయంపై దృష్టి సారించాలని నగరవాసులు కోరుతున్నారు.

# లారీ ఢీకొని యువకుడి మృతి

ఐనవోలు, మే 16: లారీ ఢీకొని యువ వ్యాపారి మృతి చెందిన సంఘటన పంథిని శివారు లక్ష్మిపురం స్టేజి వద్ద జాతీయ రహదారి(563)పై గురువారం తెల్లవారుజామున జరిగింది. ఎస్సై అనిల్‌కుమార్ కథనం ప్రకారం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం సిరిసపల్లి గ్రామానికి చెందిన యువకుడు దిగ్గిశెట్టి వినయ్‌కుమార్(30) వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలో నివాసం ఉంటూ ఒక కంపెనీ (నిత్యావసర సరుకుల విక్రయ) ఏజెన్సీ డీలర్‌గా వ్యాపారం నిర్వహిస్తున్నాడు. 18 మాసాలుగా ఇల్లందలో ఇల్లు అద్దెకు తీసుకొని ఉంటూ ఆయా మండలాల్లోని గ్రామాల్లో కిరాణం షాపులకు సరుకులు సరఫరా చేస్తున్నాడు. ఐదు రోజుల కిందట తన మేనత్త మృతిచెందగా ఐదవ రోజు కార్యక్రమంలో పాల్గొనేందుకు స్వగ్రామానికి ఉదయం ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. వరంగల్ నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న లారీ అతివేగంగా ఎదురుగా వచ్చి అదుపుతప్పి వినయ్‌కుమార్ బైక్‌ను ఢీకొట్టడంతో తీవ్రగాయాలైయ్యాయి. ప్రయాణికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించగా అంబులెన్స్ ద్వారా ఎంజీఎంకు తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# మెడికల్ షాపు నిర్వాహకుడికి ఏడాది జైలు శిక్ష

కోరుట్ల, మే 16: పట్టణంలో లైసెన్స్ లేకుండా మెడికల్ షాపు నిర్వహిస్తూ మందులు అమ్ముతున్న వ్యక్తికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ. 50,000 జరిమాన విధించిన ట్లు గురువారం కోరుట్ల కోర్టు న్యాయమూర్తి జిల్లా డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్ తెలిపారు. అయన తెలిపిన వివరాల ప్రకారం 2015లో మందులు నిలువ చేసి అమ్మతున్నా డన్న సమాచారంతో పట్టణంలోని శ్రీరామ క్లీనిక్‌పై దాడి నిర్వహించి పలు రకాల మం దులను జప్తు చేసి చేసినట్లు ఆయన తెలిపారు. క్లీనిక్ నిర్వాహకుడు రామ్మోహన్‌పై కేసు నమోదు చేసి కోర్టులో అప్పటి అధికారులు హాజరు పరిచినట్లు ఉపేందర్ తెలిపారు. ప్యాసిక్యూషన్ తరపున ప్రభుత్వ న్యాయవాది మాదవి వాదనలను న్యాయమూర్తి పావని ముందు ఉంచగా డ్రగ్స్ శాఖ అధికారులు పోలీసుల సహకారంతో సాక్షులను కోర్టులో హాజరు పరిచారు. సాక్ష్యాధారా లను పరిశీలించిన పిదప డ్రగ్స్ అండ్ కాస్మెటిక్ చట్ట నిబంధనలకు విరు ద్ధంగా మందులు నిలువ ఉంచి అమ్మి నట్లు రుజువు కావ డంతో నిందితుడు రామ్మోహన్‌కు ఏడాది జైల్ శిక్ష రూ. 50,000 జరిమానా జూనియర్ సివిల్ న్యాయమూర్తి పావని విధించినట్లు తెలిపారు.

# పడిపోయిన విద్యుత్ స్తంభాలు

గణేశ్‌నగర్, మే 16: గాలి దుమారానికి కరీంనగర్ టౌన్ డివిజన్ సిరిసిల్ల సబ్ డివిజన్ నాంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. నాంపల్లి సబ్‌స్టేషన్‌ను ఎస్ఈ వడ్లకొండ గంగాధర్, డీఈఈ రాజం పరిశీలించారు. నాంపల్లి సబ్‌స్టేషన్ 11కెవి, ట్రిప్పింగ్ విషయమై సెస్ మేనేజింగ్ డైరెక్టర్ 11కెవి మెయింటెనెన్స్, అన్ని విషయాలను వివరించారు. గురువారం సాయంత్రం ఈదురు గాలులు, వర్షం వలన నందికమాన్, మర్లపేట 33 కెవి ఫీడర్ యొక్క ఏడు కరెంటు పోల్స్ గాలి దుమారానికి పడిపోయాయి. వాటిని ఎస్ఈ, డీఈ పరిశీలించి పనులను యుద్ధ ప్రాతిపదికన చేయాలని అధికారులను ఆదేశించారు.

# ఇద్దరికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, మే 16: ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట గ్రామ శివారులో గురువారం రాత్రి ఆటో, ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో రాజన్నపేటలోకి వ్యక్తి రాణవేణి శంకర్, అల్మాస్‌పూర్ గ్రామాలకు చెందిన ఆటో డ్రైవర్ నేరేళ్ల శ్రీనివాస్‌గౌడ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను మండల కేంద్రంలోని ఓ ప్రవేటు ఆసుపత్రికి తరలించారు. శ్రీనివాస్‌గౌడ్ తన ఆటోలో ప్రయాణీలను ఎక్కించుకుని గొల్లపల్లి నుంచి అల్మాస్‌పూర్ వైపుకు వెళుతున్నాడు. రాజన్నపేటలోని వ్యక్తి రాణవేణి శంకర్ తన బైక్‌పై అటు నుంచి వస్తున్న క్రమంలో ఆటో, బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు. కాగా రోడ్డుకిరువైపుల ధాన్యం కుప్పలు ఉండడం వల్ల రెండు వాహనాలు ప్రమాదానికి గురయ్యాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

# చెరువు మట్టి..పంట పొలాలకు పుష్టి

- భూసారం పెంచుకునేందుకు రైతుల పోటీ - చెరువుల్లో పెరగనున్న నీటి నిల్వ సామర్థ్యం


చెరువులో మట్టి తీస్తున్న ఉపాధిహామీ కూలీలు

కథలాపూర్, మే 16: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద చెరువుల్లో పూడిక తొలగింపు ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతోంది. ప్రస్తుతం పంటలన్నీ చేతికి రావడంతో భూములు పడావుగా ఉన్న నేపథ్యంలో రైతాంగం పోటీ పడీ చెరువు మట్టిని పొలాల్లో వేసుకుం టున్నారు. ప్రతీ రోజూ ఉదయం చెరువుల్లో ట్రాక్టర్ల జాతర కొనసాగు తోంది. రైతులు తమ పంట పొలాల్లో భూసారం పెంచుకు నేందుకు మట్టిని తరలించుకుంటున్నారు. ఉపాధి హామి అధికార యంత్రాంగం మట్టి తరలింపుపై ప్రత్యేక దృష్టి సారించి రైతులకు మట్టిలో పోషకాల గురించి వివరిస్తున్నారు.

● **8 గ్రామాల్లో..**

మండలంలోని కలికోట, కథలాపూర్, పోసానిపేట, గంభీర్‌పూర్, దుంపెట, భూష ణరావుపేట, ఊట్‌పల్లి, దుంపెట గ్రామాల్లోని చెరువుల్లో మట్టి తరలింపు ముమ్మరంగా కొనసాగుతోంది. సుమారుగా 50 వేల క్యూబిక్ మీటర్ల మేర ఇప్పటికే రైతాంగం తమ చేలల్లో మట్టిని తరలించుకున్నారని అధికారులు పేర్కొంటున్నారు. ఏళ్ల తరబడి గుట్టల పైభాగం నుంచి చెట్ల ఆకులు వరద ఉధృతికి కొట్టుకు వచ్చి చెరువుల్లో మురి గిపోయాయి. దీంతో మట్టిలో భూసారం పెంచే పోషకాలు అధి కంగా ఉంటాయని అధి కారులు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో రైతులు భారీ సంఖ్యలో ట్రాక్టర్లు ఏర్పాటు చేసుకుని మట్టిని పోసుకుంటున్నారు. పంటల దిగుబడి ఆశించిన రీతిలో రావడానికి ఆస్కారం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఏళ్ళుగా చెత్తా, చెదారంతో పేరుకుపో యిన చెరువుల్లో మట్టి తొలగింపు కారణంగా లోతు పెరుగుతోంది. ఈ పరిస్థితు ల నేపథ్యంలో చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యం పెరిగి భూగర్భ జలాలు పుష్కలంగా పెర గడానికి దోహదం కానుందని రైతులు చెబుతున్నారు.


పొలాల్లో రైతులు వేసుకున్న మట్టి

## రైతులు మట్టిని తరలించుకుంటున్నారు..



చెరువు మట్టి వల్ల లాభాలు తెలుసుకున్న రైతులు ఎంతో ఉత్సాహంగా వేకువజామునే ట్రాక్టర్లను లైన్‌లో పెట్టుకుంటున్నారు. ఎండల కారణంగా ఉదయమే పనులు కొనసాగుతున్నందు వల్ల ఉపాధి కూలీలు సైతం అధిక సంఖ్యలో వస్తున్నారు. పోషకాలతో కూడిన మట్టి వల్ల పం టల దిగు బడులు పెరగనున్నాయి. రైతులే స్వచ్ఛం దంగా ముందుకు రావడం శుభపరి ణామం.

- వెగ్యారపు శ్రీధర్, టెక్నికల్ అసిస్టెంట్

## రైతులకు అవగాహన కల్పిస్తున్నాం..

అధికారుల సూచన మేరకు ఉపాధి పనుల్లో కూలీల హాజరు శాతాన్ని పెంచుతున్నాం. ప్రతీ దినం కూలీ సగటున రు. 292లు వచ్చే విధంగా మట్టిని తొలగించేందు ప్రణాళి కలు రూపొందించుకున్నాం. అదేవిధంగా మట్టి వల్ల చేకూరు లాభాలను వివరించడం వల్ల పోటీ పడి తమ చేలల్లో చెరువు మట్టి వేసుకుంటున్నారు. కూలీలకు తాగునీరు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతున్నాం.



- బొంగు నడ్పి సత్యనారాయణ, సీనియర్ మేట్

# ముస్తాబవుతున్న అంజన్న ఆలయం



ఆలయానికి రంగులు వేస్తున్న సిబ్బంది

- హనుమాన్ జయంతికి అధికారుల ఏర్పాట్లు

మల్యాల, మే 16: పెద్ద హనుమాన్ జయంతి కోసం కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయానికి రంగులు వేస్తున్నారు. ఈ నెల 30 నుంచి జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నారు. యేటా హనుమాన్ పెద్ద జయంతి సందర్భంగా అంజన్న ప్రధాన ఆలయంతో పాటు బేతాళుడు, శ్రీరాముల వారి ఉప ఆలయాలకు రంగులు వేస్తుంటారు. దీంతో రెండు రోజులుగా సిబ్బంది రంగులను ఆలయంకు పూసే చర్యలు చేపట్టారు. కాగా ఆలయానికి రంగులు వేసేందుకు రెండు నెలల ముందుగానే ఆలయ అధికారులు టెండర్లు ఆహ్వానిస్తుం టారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అడ్డంకి రావడంతో టెండర్లు నిర్వహించలేదు. దీంతో రంగుల వేయడం కోసం దేవస్థానం అధికారులు ప్రత్యామ్నయం కోసం పరిశీలించారు. ఆలయానికి రంగుల పూతకు సుమారు రూ. 2లక్షలు అవసరం కాగా రంగుల పూత కోసం కొండపైన దేవస్థానం ఆధ్వర్యంలో టెండర్ల ద్వారా వివిధ దుకాణాలు నిర్వహించే వ్యాపారులను ఆలయ ఈవో చంద్రశేఖర్ సంప్రదించారు. ఆలయానికి రంగుల కోసం ముందుకు రావాలని కోరారు. దీంతో కొండపైన గల దుకాణదారులు రంగులు వేయించడంకు ముందుకు వచ్చారు. ఈ మేరకు రెండు రోజులుగా రంగుల పనులు చేపడుతున్నారు.

# ధర్మపురిలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

ధర్మపురి, మే 16: ధర్మపురి క్షేత్రంలో నాల్గో రోజు గురువారం శ్రీ నృసింహ నవరాత్రోత్సల్లో భాగంగా ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ తదితర వేదబ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, అర్చకులు పురుషసూక్త, శ్రీసూక్త, కల్పోక్త, వ్యాసపూర్వక, శోడషోపచార పూజ, సహస్ర నామార్చన, పంచోపనిషత్తులచే రుద్రాభిషేకం కార్యక్రమాలు నిర్వహించారు. దేశంలో దుర్భిక్ష నివారణ కోసం, సువృష్టి ప్రాప్తికై, సకల ఈతి బాధల నివారణ, అనువాహక హోమాలు నిర్వహించారు. సామవేద పారాయణంతో అభిషేక పూజలు, వాస్తు, యోగిని, క్షేత్ర పాలక, నవగ్రహ, సర్వతోభద్ర మండల స్థాపిత దేవతా పూజలు, సహస్ర, వరుణ, కళశ స్థాపన పూజలు చేశారు. అలాగే లోక కల్యాణార్థం లక్ష్మీ నారసింహ, మూల మంత్ర, వరుణ మూల మంత్ర, రుద్ర హోమాలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ కుమార్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివా సాచారి, చిలుకముక్కు రమణాచార్యా, నరసింహమూర్తి, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీని వాస్, బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్ పాల్గొన్నారు.

## యునెస్కో సమావేశానికి ఆహ్వానం



కొత్తిరెడ్డి మల్లారెడ్డి

ఓదెల, మే 16: యునెస్కోలో అక్టోబరు 10, 11న నిర్వహించే విద్యాస మావేశానికి ఆహ్వానం అందినట్లు ఓదెల మండలం కొమిరకు చెందిన ఎస్‌ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ కొత్తిరెడ్డి మల్లారెడ్డి తెలిపారు. యూనెస్కో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఎడ్యుకేషన్ నెట్‌వర్క్‌లో సహకారాన్ని పెంపొందించడం ద్వారా యువత కోసం సమర్థవంతమైన వ్యవస్థాపక విద్య వ్యూహాల రూపకల్పన గురించి ఉజ్బెకిస్తాన్‌లోని తాష్కెంట్‌లో అక్టోబరు 10,11న విద్యా సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి ఎంపిక చేస్తూ తనకు యునెస్కో నుంచి ఆహ్వానం అందినట్లు మల్లారెడ్డి తెలిపారు. యునెస్కో సమావేశానికి డా.కొత్తిరెడ్డి మాల్లారెడ్డి ఎంపిక కావడం పట్ల ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డా.కల్వకుంట రామకృష్ణ, తెలంగాణ ప్రభుత్వ కళాశాలల గెజిటెడ్ అధ్యాపక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.కె. సురేందర్‌రెడ్డి, స్టాఫ్ సెక్రెటరీ డా.ఎ. శ్రీనివాస్, జిల్లా బాధ్యులు డా.జి.శ్రీనివాస్ వైస్ ప్రిన్సిపాల్స్ డా.ప్రమోద్‌కుమార్, టి.రాజయ్య అధ్యాపకులు, విద్యా ర్థులు అభినందనలు తెలిపారు.

## రూ.7,050 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, మే 16: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,050 రూపాయలు పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు తొమ్మిది మంది రైతులు 77క్వింటాళ్ల విడి పత్తి, ఇద్దరు రైతులు రెండు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,050, కనిష్ఠ ధర 5వేల రూపాయలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

## 27 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

హుజూరాబాద్ రూరల్, మే 16: అక్రమంగా తరలిస్తున్న 27క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు టౌన్ సీఐ బొల్లం రమేశ్ గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం హుజూరాబాద్ మండలంలోని కందుగుల గ్రామానికి చెందిన బత్తుల ఆకయ్య, గంట అనిల్, నర్రావుల అనిల్ అనే వ్యక్తులు గ్రామాల్లో పీడీఎస్ బియ్యాన్ని ప్రజల వద్ద నుంచి తక్కువ రేటుకు కొనుగోలు చేస్తున్నారు. అలా కొనుగోలు చేసిన పీడీఎస్ బియ్యాన్ని అనంతసాగర్‌లోని కోళ్ల ఫారాలకు తరలిస్తున్నారు. అందులో భాగంగా 27క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని టీఎస్03 యూడీ0406 అనే వాహనంలో అక్రమంగా తరలిస్తున్నారు. పక్కా సమాచారం మేరకు రాంపూర్ గ్రామ శివారులో ఎస్సై సాంబయ్యగౌడ్ సిబ్బందితో పట్టుకున్నారు. పట్టుకున్న పీడీఎస్ బియ్యాన్ని, వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించామని, అక్రమంగా బియ్యాన్ని తరలిస్తున్న బత్తుల ఆకయ్య, గంట అనిల్, నర్రావుల అనిల్‌లపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ రమేశ్ తెలిపారు. అక్రమంగా బియ్యం తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ప్రమాదవశాత్తు రైలు కింద పడి ఒకరి మృతి

పెద్దపల్లిటౌన్, మే 16: ప్రమాదవ శాత్తు రైలు కింద పడి ఓ వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు. గురువారం సుమారు 25 నుంచి 30 ఏళ్ల యువకుడు పెద్దపల్లి రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని రైలుబండి ఎక్కబోయి లేదా రైలులో ప్రయాణిస్తుండగా రైలు నుంచి కింద పడిపోయినట్లు భావిస్తున్నట్లు తెలిపారు. మృతుని ముఖము నుజ్జు నుజ్జు కావడంతో గుర్తుపట్టడానికి వీలులేకుండా ఉన్నట్లు తెలిపారు. ఎలాంటి అడ్రస్ ఆధారాలు లభించలేదని, కుడి చేతిపై కాంతమ్మ అని తెలుగులో పచ్చబొట్టు ఉన్నట్లు, మెరున్ రంగు హాఫ్ టీ షర్ట్ , మెరున్ రంగు లోయర్ ప్యాంట్ ధరించి ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని గోదావరిఖని ప్రభుత్వాస్పత్రి మార్చురీలో భద్రపర్చినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. వివరాలు తెలిస్తే ఫోన్ నెంబరు: 9949304574, 871268604లో సంప్ర దించాలని కోరారు.

## చికిత్స పొందుతూ యువకుడి మృతి

కోరుట్ల, మే 16: పట్టణంలోని అయిలాపూర్ రోడ్డులో నివాసం ఉంటున్న ఇందూరి నర్సింహాచారి (25) అనే యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు. పోలీసులు బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... నర్సిం హాచారి కుల వృత్తి నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొన్ని రోజుల నుంచి నర్సింహాచారి సరైన పని లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. రెండు రోజుల క్రితం ఇంట్లో యాసిడ్ తాగి అపస్మారక స్థితిలో పడిపోయి ఉన్నాడు. కుటుంబ సభ్యు లు గమనించి చికిత్స నిమిత్తం కోరు ట్ల ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కొనం కరీంనగర్‌కు తరలించింగా చికిత్స పొందుతూ నర్సింహాచారి గురువారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. నర్సింహాచారి తండ్రి వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు.

## పీజీ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, మే 16: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించిన ఎంబీఏ, ఎంసీఏ, ఎమ్మెస్సీ .(ఫిజిక్స్, ఇంజనీరింగ్ ఫిజిక్స్) 3,1వ సెమిస్టర్ మార్చి 2024 పరీక్షల ఫలితాలను గురువారం విడుదల చేసినట్లు శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్ వి శ్రీరంగప్రసాద్ తెలిపారు. విద్యార్థిని విద్యార్థులు ఫలితాలను యూనివర్సిటీ వెబసైట్ www. satavahana.ac.inలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

## అంతర్జాతీయ వైజ్ఞానిక కార్యక్రమానికి విద్యార్థిని ఎంపిక



ప్రాజెక్టు వివరాలను రాష్ట్రపతికి వివరిస్తున్న విద్యార్థి పూజశ్రీ

పెద్దపల్లి కల్చరల్, మే 16: జిల్లా విద్యార్థిని 9వ జాతీయ ఇన్‌స్పైర్ అవార్డుల పోటీల్లో సత్తాచాటిన జిల్లా విద్యార్థినికి మరో అరుదైన అవకాశం లభించింది. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండల కేంద్రంలోని అల్ఫోర్స్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థిని ముస్త్యాల పూజశ్రీ మే 19 నుంచి 25వ తేదీ వరకు జపాన్ రాజధాని టోక్యో వేదికగా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే సకూర కార్యక్రమంలో పాల్గొనాలని ఈ మేరకు కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖ నుంచి విద్యార్థినికి ఆహ్వానం అందినట్టు జిల్లా విద్యాశాఖాధికారి డి.మాధవి తెలిపారు. 2022సెప్టెంబర్ 14 నుంచి 16 వరకు ఢిల్లీలో జరిగిన 9వ జాతీయ ఇన్‌స్పైర్ వైజ్ఞానిక ప్రదర్శనలో రాణించి కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ చేతుల మీదుగా పూజశ్రీ అవార్డు అందుకున్నట్టు డీఈవో పేర్కొన్నారు. అలాగే గత ఏడాది ఏప్రిల్ 10న రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన ఫైన్ కార్యక్రమంలో పాల్గొని ప్రతిభ చాటినట్లు తెలిపారు. జపాన్ సకూర అంతర్జాతీయ వైజ్ఞానిక కార్యక్రమానికి గత ఏడాది నవంబర్‌లో జిల్లాకు చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చందనాపూర్ పదో తరగతి విద్యార్థిని దాసరి హర్షిత ఇప్పటికే ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపారు. జిల్లా నుంచి విద్యార్థి ఎంపిక కావడం పట్ల పూజశ్రీని అలాగే ప్రోత్సహించిన గైడ్ టీచర్ ను డీఈవో డి.మాధవి, జిల్లా సైన్స్ అధికారి బి.రవినందన్ రావులు గురువారం ఒక ప్రకటనలో అభినందించారు.

# కళతప్పిన కొత్తపల్లి చెరువు

- అడుగంటిన జలాలతో ఆందోళనలో అన్నదాతలు
- మత్స్యకారులకు ఉపాధి కరువు



నీటిమట్టం తగ్గిన కొత్తపల్లి చెరువు

భగత్‌నగర్, మే 16: ప్రతి ఏటా నిండుకుండలా జలకళ సంతరించుకుని ఉండే కొత్తపల్లి చెరువులో నీరు తగ్గి కళ తప్పింది. ఎండాకాలంలో సైతం మత్తడి దూకిన కొత్తపల్లి చెరువు కళా విహీనంగా తయారైంది. కొత్తపల్లి చెరువు 195 ఎకరాల విస్తీర్ణంలో జల కళతో నిండుకుండలా ఉండాల్సిన చెరువులో నీరు లేక వెలవెలబోతున్నది. వేలాది ఎకరాలకు సాగు నీరు అందించాల్సిన కొత్తపల్లి చెరువు కళావిహీనంగా మారడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్తపల్లి చెరువులోకి సమీప మండలాలైన బోయినపల్లి, రామడుగు, గంగాధర మండలాల్లోని 29 చెరువులు, కుంటల నుంచి వరద నీరు చేరిపోతుండేది. కాళేశ్వరం నీరు రాకపోవడంతో వరద నీరు లేక కొత్తపల్లి చెరువులోకి నీరు చేరే పరిస్థితి లేకుండా పోయింది. దీనికి తోడు వెలిచాల సమీపంలో నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణంతో కాలువల ద్వారా నీరు రాకుండా నిలిపి వేయడంతో కొత్తపల్లి చెరువులోకి నీరు చేరే పరిస్థితి లేకుండా పోయింది. కొత్తపల్లి చెరువు నిండి మత్తడి దూకినప్పుడు వరదనీరు కరీంనగర్ రూరల్ మండలంలోని దుర్శేడ్ వాగులోకి వెళ్లాయి. ఈ ప్రాంతంలోని కొత్తపల్లి చెరువులో నీరు లేక పోవడంతో ఈ ప్రాంతంలో చెరువుపై ఆధారపడి పంటలు పండించే రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు కొత్తపల్లి చెరువు మత్స్యకారులకు సైతం వరప్రదాయినిగా నిలుస్తున్నది. చెరువులో నీరు లేక పోవడంతో చేపలు కూడా లేకుండా పోతున్నాయి. కొత్తపల్లి చెరువు నింపేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించి జల కళ తీసుకు రావాలని ఈప్రాంత వాసులు కోరుతున్నారు.

● కలగానే మిగిలిన మినీ ట్యాంక్‌బండ్

కొత్తపల్లి చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేసేందుకు గత ప్రభుత్వం పూనుకున్నా ఆ దిశగా అడుగులు పడలేదు. దీంతో కొత్తపల్లి చెరువును మినీ ట్యాంక్ బండ్ చేయాలనే ఉద్దేశం కలగానే మిగిలిపోయింది. నగరానికి సమీపంలో ఉండడంతో కొత్తపల్లి చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా ఎంపిక చేసి పర్యాటకుల సందర్శనకు అనువుగా తీర్చిదిద్దాలనుకున్నారు. కొత్తపల్లి-మల్కాపూర్ గ్రామాలకు వెళ్లేందుకు బ్రిడ్జి నిర్మాణ పనులు ఇప్పుడిపుడే సాగుతున్నాయి. కొత్తపల్లి చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# రైతులపై కేసీఆర్ మొసలి కన్నీరు

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

సారంగాపూర్, మే,16: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పదవి పోయాక రైతులపై మొసలి కన్నీరు కార్చుతున్నారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విమర్శించారు. గురువారం మం డలంలోని లచ్చక్కపేట గ్రామంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ పార్టీకి క్యాడర్ లేదని బీజేపీకి కుదువ పెట్టారని మం డిపడ్డారు. రాష్ట్రంలో సన్న రకం ధాన్యానికి అధిక డిమాండ్ పెరగడంతో సన్న రకం ఉత్ప త్తులను ప్రోత్సహించేందుకు అదనపు రాయితీ కల్పించి రైతులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచన చేస్తున్నారని తెలిపారు. ఆనాడు కేసీఆర్ సన్న రకం సాగు చేయాలని రైతులను మోసం చేసిన సంగతిని గుర్తు చేస్తూ ఫైర్ అ య్యారు. రైతుల సంక్షేమం కోరేది కేవలం కాంగ్రెస్ పార్టీయేనన్నారు. ప్రభుత్వం పంపిణీ చేయబడుతున్న బియ్యం వినియోగ దారులు ఎక్కడ వినియోగించడం లేదనే ఉద్దేశ్యంతో వినియోగించుకునేలా ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు. కేసీఆర్ వాస్తవాలను గ్రహించకుండా మాట్లాడుతున్నారని అన్నారు. కేసీఆర్ మూసి వేసిన చక్కెర ఫ్యాక్టరీని పున ప్రారంభం చేందుకు ప్రభుత్వం చిత్త శుద్ధితో పని చేస్తుందని తెలిపారు. జిల్లాలో మిల్లుల సామర్థ్యం లేక పోవడంతో ఇతర జిల్లాలకు తరలించి రెండు వారాల్లో మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేసేల చర్యలు చేపట్టాలని కలెక్టరు, పౌర సరఫరాల కమిషనర్‌తో మాట్లాడినట్లు తెలిపారు. రైతుల రుణమాఫీ రూ, 2లక్షలు ఏక కాలంలో చేసి ఇచ్చిన మాట నిరుపించుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు కోండ్ర రాంచందర్‌రెడ్డి, బేతి శంకర్‌రెడ్డి, రవి, సుధాకర్, బేర మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల రాస్తారోకో



కోనరావుపేట ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

కోనరావుపేట, మే 16: ధాన్యం కొనుగోలు చేయడంలో జాప్యం జరగడమే కాకుండా కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించకపోవడంతో కోనరావుపేట మండల కేంద్రంలో రైతులు ధాన్యం బస్తాలతో గురువారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా లేకపోవడంతో అకాల వర్షాలతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలను లారీల కొరతతో తరలించడం లేద న్నారు. రైతులు ధర్నాకు దిగడంతో వచ్చి పోయే వాహనాలకు ఇబ్బంది కలగడంతో విషయం తెలుసుకున్న కోనరావుపేట ఎస్సై అంజనేయులు అక్కడికి చేరుకొని అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని రైతులను ఒప్పించడంతో రాస్తారోకో విరమించారు.

**చందుర్తి:** ధాన్యం కొనుగోలు చేయాలని కోరుతూ చందుర్తి మండలం జోగాపూర్ గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట గురువారం రైతులు ఆందోళన చేపట్టి, నిరసన వ్యక్తం తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో స్థలం లేక, పొలాల వద్ద విక్రయించేందుకు నెల రోజుల నుంచి సిద్ధంగా ఉంచినప్పటికీ, కొనుగోలు చేయడం లేదన్నారు. ప్రస్తుతం వర్షాలు కురిసే పరిస్థితి ఉందని, వర్షాలు కురిస్తే పొలాల వద్దకు లారీలు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉంటుందన్నారు. లారీలు, గన్నీ సంచుల కొరత లేకుండా వెంటనే ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని చందుర్తి సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మ్యాకల పరశురాములు, సింగిల్ విండో డైరెక్టర్ నాగం శ్రీనివాస్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



జోగాపూర్ గ్రామపంచాయతీ ఎదుట నిరసన తెలియజేస్తున్న రైతులు

## దాడి చేసిన ఇద్దరి అరెస్ట్

గొల్లపల్లి, మే 16: గొల్లపల్లి మండలం గుంజపడుగు గ్రామంలో రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో ఓ కుటుంబం పై దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన గ్రామానికి చెందిన కల్లెం తిరుపతి, కల్లెం తిరుమలేష్ గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై చిర్ర సతీష్ కుమార్ తెలిపారు. గ్రామంలో ఇరు కుటుంబాల మధ్య ఓ ప్రహరీ గోడ విషయంలో జరిగిన గొడవల్లో పలువురికి తీవ్ర గాయాలు కాగా, గ్రామంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులకు దారితీసి పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. బాధిత కుటుంబ సభ్యుల పై కర్రలతో దాడి చేసి సమ్మయ్య, పోశయ్య అనే ఇరువురు వ్యక్తుల పై దాడి చేసిన నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

## పిల్లలపై వీధికుక్క దాడి



గాయపడిన బాలుడు

సిరిసిల్ల రూరల్, మే 16 : పసి పిల్లలపై వీధి కుక్క దాడిచేసి గాయపర్చిన సంఘటన గురువారం సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌లో చోటు చేసుకుంది. పట్టణంలో 34 వవార్డు బీవైనగర్‌కు చెందిన మమత- వెంకటేశం దంపతుల కుమారుడు నర్సింగోజ్ లిమ్స్ అనే మూడేళ్ల బాలుడు ఇంట్లో నుంచి బయటకు వస్తున్న క్రమంలో వీధి కుక్క దాడి చేసింది. ఈ దాడిలో బాలుడు తీవ్ర గాయాలకు గురయ్యాడు. గమనించిన కుటుంబసభ్యులు కుక్క బారినుంచి బాలుడిని కాపాడి జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. అదే వార్డుకు చెందిన చౌదరం రాజు, సుమలత దంపతుల కుతురు చౌదరపు అద్య అనే చిన్నారిపై కుక్క దాడి చేసి గాయపడర్చడంతో కుటుంబసభ్యులు చిన్నారిని ఆసుపత్రికి తరలించారు. వార్డులో వీధి కుక్కలు చాలా ఉన్నాయని ఇప్పటివరకు 15 మందిపై దాడులు చేసి గాయపరిచాయని వార్డు కౌన్సిల ర్ తెలిపారు. కుక్కల నివారించాలని మున్సిపల్ అధికారులకు పలు మార్లు ఫిర్యాదు చేసినా ఎవరు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. వార్డులో చిన్నపిల్లలు రోడ్డుపై ఆడుకోవడానికి రావడానికి భయంతో వణికిపోతున్నారని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## పిడుగుపాటుకు ఆవు, దూడ మృతి

తిమ్మాపూర్ (మానకొండూర్), మే 16: మండలంలోని పర్లపల్లి గ్రామానికి చెందిన ఏనుగుల మల్లయ్యకు చెందిన ఆవు, దూడ, గురువారం పిడుగుపాటుకు గురై మృతి చెందాయి. ఆవుదూడ మృతి చెందడంతో రైతు మల్లయ్య కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. వీటి విలువ సుమారు లక్షా 25వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

# గాడిదల పెంపకంపై ఆసక్తి

- సౌందర్య ఉత్పత్తులకు పాల వినియోగం
- లీటరు పాల ధర రూ. 3 నుంచి 5వేలు



చిగురుమామిడిలో గాడిదల కోసం నిర్మించిన షెడ్డు

చిగురుమామిడి, మే 16: మండలంలోని రెండు గ్రామాల్లో గాడిదల ఫామ్‌ల ద్వారా ఉపాధి పొందుతు న్నారు. పెంపకం చేపడుతున్నారు. గరిటడైన చాలు గాడిద పాలు అన్న నానుడిని నిజం చేస్తూ యువకులు ఉపాధి పొందుతూ స్ఫూర్తిగా నిలు స్తున్నారు. మండ లంలోని ఇందుర్తి, చిగురుమామిడి గ్రామాల్లో కొందరు స్నేహితులు కలిసి ఆయా గ్రామాల్లో గాడిదల ఫామ్‌లు ఏర్పాటు చేసి మండలంలోని నిరుద్యోగ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. కత్తియానాడీ, అలరీ అనే బ్రీడ్ గాడిదలను చెన్నై, బెంగుళూరు నుంచి కొనుగోలు చేశారు. ఒక్కొ క్క గాడిద ధర 70 వేల నుంచి 2లక్షల రూపాయల వరకు ఉంటుంది. ప్రస్తుతం ఆ రెండు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఫామ్‌ల్లో 40 పైగ గాడిదలు ఉన్నాయి. వాటిని ప్రతిరోజు గేదెల మాదిరిగానే మేత కోసం తీసుక వెళ్లాలి. ఒక్కొక్క గాడిద అర లీటరు నుంచి లీటరు వరకు పాలు ఇస్తుందని పెంపకందారులు చెబుతున్నారు. పాలను చెన్నై తదితర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నామని తెలిపారు. గాడిద పాలను సౌందర్య ఉత్పత్తులకు వినియోగిస్తుం డడంతో మంచి డిమాండ్ ఉంది. లీటరు పాల ధర 3 నుంచి 5 వేల రూపాయల వరకు ఉంటుంది. గాడిదల మేత కోసం దశరథి అనే పచ్చి గడ్డిని పెం చుతున్నారు. గడ్డిని మిషన్ ద్వారా కట్ చేసి గాడిదలకు మేతగా వేస్తారు గాడిదల పాలకు ఇతర దేశాల్లో భలే గిరాకి ఉంటున్నం దున, అధిక పెట్టుబ డులు పెట్టి గాడిదల ఫామ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. పాలను నిల్వ చేసేందుకు ఫ్రిడ్జిలు ఏర్పాటు చేశారు. రోజు వారిగా పాలు విక్రయించకుండా కొన్ని లీటర్ల పాలు నిల్వ అయిన తరువాతే సంబంధిత (చెన్నై) వ్యాపారులకు సమాచారం ఇస్తే సిబ్బంది తీసుకెళుతున్నారు.



చిగురుమామిడిలో పెంచుతున్న గాడిదలు

### ప్రభుత్వాలు చేయూతనివ్వాలి



గాడిదల పెంపకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేయూతనివ్వాలి. గాడిదల కొనుగోలుకు అధికంగా పెట్టుబడి అవసరం ఉన్నందున ప్రభుత్వాలు ఆర్థికంగా చేయూతనిస్తే యువలకు ప్రోత్సహకరంగా ఉంటుంది. గాడిద పాలను ఎగుమతి చేసేందుకు చర్యలు తీసుకుంటే ధర అధికంగా వచ్చే అవకాశం ఉంటుంది.

- వేముల రాము, ఫాం నిర్వాహకుడు

## ముఖ్యమంత్రిని కలిసిన జిల్లా సోషల్ మీడియా వారియర్స్



ముఖ్యమంత్రితో గడ్డం మధుకర్

తంగళ్లపల్లి, మే 16: రాజన్న సిరిసిల్ల జిల్లా సోషల్ మీడియా కో ఆర్డినేటర్ గడ్డం మధుకర్ ఆధ్వర్యంలో సోషల్ మీడియా వారియర్స్ హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. గురువారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోషల్ మీడియా వారియర్స్‌తో ఏర్పాటు చేసిన సమావేశానికి వెళ్లినట్లు మధుకర్ తెలిపారు. జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లాలోని సోషల్ మీడియా వారియర్స్ సమావేశానికి హాజరైనట్లు తెలిపారు. సమావేశం అనంతరం జిల్లాలోని వారియర్స్ ముఖ్యమంత్రిని కలిసినట్లు చెప్పారు. సోషల్ మీడియా వారియర్స్ బాగా పని చేశారని ఇకముందు కూడా ఆదే ఉత్సాహంతో పని చేసి ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పలవురు కో ఆర్డినేటర్‌లు కనికరపు రాకేష్, బొజ్జ మల్లేశం, గుగ్గిళ్ల అభినయ్‌గౌడ్, జాగిరి వేణుగౌడ్, బానోత్ రమేష్ నాయక్, పర్శరాములు, ఫౌల్, భాను, చందర్ , రాజు, ప్రసాద్‌రావు, అరుణ్, ప్రభాకర్, అనిల్, రమేష్ తదితరులు ఉన్నారు.

## గ్రామ పంచాయతీ కార్మికురాలి కుటుంబాన్ని ఆదుకోవాలి

తంగళ్లపల్లి, మే 16: గ్రామ పంచాయతీ కార్మికురాలు లింగం సూరవ్వ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ డిమాండ్ చేశారు. తంగళ్లపల్లి గ్రామ పంచాయతీ కార్మికురాలు లింగం సూరవ్వ గుండె పోటుతో మృతి చెందగా కార్మిక సంఘాల నాయకులు గురువారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, జిల్లా నాయకుడు అన్నల్‌దాస్ గణేష్ మాట్లడుతూ గ్రామ పంచాయతీ కార్మికులు నెలల తరబడి వేతనాలు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం కార్మికులను నిర్లక్ష్యం చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే ధోరణి అవలంబిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలన్నారు. పెండింగ్ వేతనాలతో పాటు కార్మికులకు 10లక్షల ప్రమాద బీమా, 10లక్షల వరకు ఉచిత వైద్య సదుపాయం, ఉద్యోగ భద్రత, కనీస వేతనం రూ.24వేలు చెల్లిస్తు పర్మినెంట్ చేయాలని డిమాండ్లను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్, కార్యదర్శి కృష్ణవేణి, ఉపాధ్యక్షులు రవీందర్ పాల్గొన్నారు.

## వడదెబ్బ తాకకుండా జాగ్రత్తలు పాటించాలి

పెగడపల్లి, మే 16 : ఎండాకాలం వేడిగాలుల దృష్ట్యా ఉపాధిహామీ పనుల లో వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు పాటిస్తూ పనులు చేయాలని పెగడపల్లి ఎంపీడీవో ఏ.శ్రీనివాస్ రెడ్డి ఉపాధిహామీ కూలీలకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఎగ్లెలకుంటలో ఉపాధిహామీ పథకంలో భాగంగా చెరువు పూడికతీత పనులను ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మాస్టర్ రోల్‌ను, పని ప్రదేశం వద్ద వసతులు , తాగునీటి సౌకర్యం తదితర అంశాలను పరిశీలించారు. కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు. పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, ఫీల్డ్ అసిస్టెంట్ రవి ఉన్నారు.

## ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్ల కోసం ప్రచారం

కోరుట్ల, మే 16 : ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్య గురించి ప్రచారం నిర్వహిస్తూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యను అభ్యసించే విధంగా కోరుట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉపన్యాసకులు పట్టణంలో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జిందం రాజేష్ ఆధ్వర్యంలో ఉపన్యాసకులు శ్రీనివాస్, వంశీకృష్ణ, శిరీస్, సాయికృష్ణ, రాజు ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇటీవల వచ్చిన ఫలితాలను వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. జూనియర్ కళాశాలలో ఉన్న మౌలిక వసుతులను వివరిస్తూ అడ్మిషన్ల చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ కళాశాలలో విద్యను అభ్యసిస్తే రెండేళ్ల ఉచిత విద్యతో పాటు రాబోవు రోజుల్లో ఇంనీరింగ్, ఇతర టెక్నికల్ కోర్సులలో పూర్తి ఫీజు రియింబర్స్‌మెంట్ అందించి వారు చేసే కోర్సు పూర్తిగా ఉచితంగా చేయవచ్చునని తెలుపుతున్నారు.

## గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

మెట్‌పల్లి రూరల్, మే, 16 : మండలంలోని ఆత్మకూర్ గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బండ శ్రీనివాస్ అన్నారు. గురువారం గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడుగా బండ శ్రీనివాస్‌ను గ్రామస్థులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైనా బండ శ్రీనివాస్‌ను గ్రామంలోని పలు కుల సంఘాల నాయకులు శాలువలతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కోసం అన్ని కుల సంఘాల సూచనలతో నాయకుల సహాకరాంతో కృషి చేస్తాన్నన్నారు. గ్రామంలోని సమస్యలను గ్రామస్థుల సహకారంతో నిరంతరం అందుబాటులో ఉండి పరిష్కరించడమే లక్ష్యంగా పని చేస్తాన్నారు. ఈ కార్యక్రమంలో నాయకుల చౌటుపల్లి అంజయ్య, నేరెళ్ల శ్రీధర్, నేరెళ్ల శ్రీనివాస్, తుమ్మల రాజారెడ్డి, జీవన్‌రెడ్డి, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# గుట్టుగా గుడుంబా తయారీ

- దాడులు చేసినా ఆగని దందా
- పట్టణాలకు తరలుతున్న సారా

ఎల్లారెడ్డిపేట, మే 16: ఎల్లారెడ్డిపేట మండలం బుగ్గరాజేశ్వతండా, గుండారం, అక్కపల్లి, దేవునిగుట్ట తండా, గుంటపల్లిచెరువుతండా, అల్మాస్‌పూర్ తదితర గ్రామ పంచాయతీ పరిధిలోని గిరిజన తండాల్లో గుడుంబా తయారీ గుట్టుగా సాగుతోంది. తండా శివారుల్లోని అటవీ ప్రాంతాలు, వ్యవసాయ పొలాల్లో గుడుంబా కాగుతోంది. ఎక్సైజ్ అధికారులు దాడులు చేసినా ఆగడం లేదు. నిత్యం వందల లీటర్ల సారా తయారవుతోంది. మండల కేంద్రాలతోపాటు సిరిసిల్ల, సిద్ధిపేట, కామారెడ్డి పట్టణాలకు తరలుతోంది.

### ● మాచారెడ్డి కేంద్రంగా బెల్లం, పటిక విక్రయాలు

కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండల కేంద్రంగా ఎల్లారెడ్డిపేట మండలంలోని గిరిజన తండాలకు సారా తయారీ ముడి పదార్థాలైన బెల్లం, పటికను తరలిస్తున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా అటవీ ప్రాంతాలు, వ్యవసాయ పొలాల్లో బెల్లం పానకం నిల్వ చేస్తున్నారు. వేకువజామున, రాత్రి వేళలో సారా బట్టీలను పెడుతున్నారు. కొన్ని కుటుంబాలు సారా తయారీపై ఆధార పడి జీవిస్తున్నాయి. తయారు చేసిన సారాను ప్లాస్టిక్ కవర్లలో నింపి రహస్యంగా తరలిస్తున్నారు. పట్టణాల్లోని కూలీలు సారాకు అలవాటు పడి అనారోగ్యం పాలవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గుడుంబా తయారీపై దృష్టి పెట్టి అరికట్టాలని కోరుతున్నారు.

### - అరికట్టేందుకు కృషి

- శ్రీనివాస్, ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ సీఐ

నాటు సారా తయారు చేసినా, విక్రయించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. గుడుంబా తయారు చేస్తున్నవారి వివరాలను అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతాం. తండాల్లో విస్తృత దాడులు నిర్వహించి అరికట్టేందుకు కృషి చేస్తాం.



బెల్లం పానకాన్ని పారబోస్తున్న సిబ్బంది

## రైతు సంక్షేమమే ధ్యేయం

ఎల్లారెడ్డిపేట, మే 16: రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్స య్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో గురువారం మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజను సర్కారు కొనుగోలు చేస్తోందన్నారు. ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, వీర్నపల్లి మండలాల్లోని ఆయా గ్రామాల్లో ధాన్యం సేకరణ చివరి దశకు చేరుకున్నాయన్నారు. ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాయన్నారు. రైతులకు రైస్ మిల్లర్లతో నష్టం జరుగకుండా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. రైతుబంధు అందించినట్లు తెలిపారు. వచ్చే వానాకాలం పంట నుంచి బోనస్ అందించడంతోపాటు రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారన్నారు. అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేలు చెల్లించిందన్నారు. అన్నదాతలను సర్కారు ఆదుకుంటోందన్నారు.

## ఇసుక లారీల పట్టివేత

గంభీరావుపేట, మే 16: గంభీరావుపేట మండలం రాజేశ్వర్ రావునగర్ కాలనీ వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను పట్టుకున్నట్లు ఎస్సై రాంమోహన్ తెలిపారు. అనుమతులు లేకుండా కాళేశ్వరం నుంచి రాజేశ్వర్‌రావునగర్ మీదుగా కామారెడ్డి వైపు తరలిస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. లారీ డ్రైవర్లు రవి, ఐలయ్య, లారీ ఓనర్ శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాంమోహన్ వెల్లడించారు.

# భూసేకరణ పనుల్లో వేగం పెంచాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల కలెక్టరేట్, మే 16: కొత్తపల్లి- మనోహరాబాద్ రైల్వేలైన్ నిర్మాణానికి భూసేకరణ పనులు వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం భూసేకరణ పనులు, ఇతర అంశాలపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొత్తపల్లి- మనోహరాబాద్ రైల్వేలైన్ నిర్మాణానికి జిల్లాలోని వేములవాడ నియోజకవర్గం పరిధిలోని వేములవాడ, అనుపురం, కొడుముంజ, నాంపల్లి గ్రామాల్లో ఇంకా భూసేకరణ చేయాల్సి ఉందని వివరించారు. ఆయాశాఖల అధికారులు సమన్వయంతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, డీఎఫ్‌వో బాలమణి, రైల్వే శాఖ సీఈ సిరిసిల్ల ఆర్డీవో రమేష్, ఏడీ సర్వేయర్ శ్రీనివాస్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# యారన్ సబ్సిడీ తగ్గించొద్దు



నిరసన తెలుపుతున్న కార్మికులు

తంగళ్లపల్లి, మే 16: యారన్ సబ్సిడీ తగ్గించవద్దని, గతంలో మాదిరిగానే 10 శాతం కార్మికులకు చెల్లించాలని సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ డిమాండ్ చేశారు. గురువారం తంగళ్లపల్లి మండలం బద్దనపల్లి టెక్స్‌టైల్ పార్కు పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం అధ్యక్షుడు కూచన శంకర్ అధ్యక్షతన నిర్వహిం చారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించి తీర్మానం చేశారు. 2022-23 సంవత్సరంలో ఉత్పత్తి చేసిన బతుకమ్మ చీరల బ్లౌస్ పీస్ వస్త్రానికి సంబంధించి కార్మికులకు చెల్లించాల్సిన 10 శాతం యారన్ సబ్సిడీ తగ్గింపు చేసి ఇచ్చిన విషయంపై చర్చించారు. 10 శాతం సబ్సిడీ తగ్గకుండా కార్మికులకు మూడు రోజుల్లో అందివ్వాలని, లేకుంటే హైదరాబాద్‌లో చేనేత జౌళి శాఖ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించాలని తీర్మానం చేశారు. అనంతరం రమణ మాట్లడుతూ గత ప్రభుత్వం యారన్ మీద 10శాతం సబ్సిడీని కార్మికులకు చెల్లించిందని, ప్రస్తుత ప్రభుత్వం వేతనం మీద 20శాతం సబ్సిడీ చెల్లిస్తుడడంతో కార్మికులు నష్టపోతున్నారని అన్నారు. పాత విధానాన్ని అమలు చేసి కార్మికులు నష్ట పోకుండా చూడాలని, లేకుంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. మూడు రోజుల్లోగా పాత విధానంతో సబ్సిడీ డబ్బులు కార్మికులకు చెల్లించకుంటే హైదరబాద్‌లో చేనేత జౌళిశాఖ కమిషనరేట్ ముట్టడిస్తామన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా నాయకులు అన్నల్‌దాస్ గణేష్, టెక్స్‌టైల్ పార్క్ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ నాయకులు అక్కల శ్రీనివాస్, జెల్ల సదానందం, ఆడెపు శుభోశేఖర్, రాజమల్లు, శ్రీనివాస్, రవి, నరేశ్, శ్రీకాంత్, వెంకటేశ్, సంపత్, ఆంజనేయులు, రాజశేఖర్, రమేష్, రాజు, శంకర్, అంబదాస్ కార్మికులు పాల్గొన్నారు.

# అప్రమత్తతతో అధిక రక్తపోటు నివారణ

- నేడు వరల్డ్ హైపర్ టెన్షన్ డే

జగిత్యాల, మే 16 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు ఒత్తిడితో కూడిన జీవన శైలి పెరుగుతున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల కొంత నివా రణ సాధ్యమవుతుందని వైద్యులు అంటున్నారు. అధిక రక్తపోటు లేదా హైబీపీని సైలెంట్ కిల్లర్ అని పిలుస్తుంటారు. ఎందుకంటే ఇది వచ్చిన సంగతి కూడా వ్య క్తులు కనిపెట్టలేని పరిస్థితి కొన్ని సందర్భాల్లో ఉంటాయంటున్నారు. నిజానికి హై బీపీ కొన్ని లక్షణాలు చూపిస్తుందని, ఆ లక్షణాలపై అవగాహన లేకపోవడం వల్ల బీపీ బాగా ముదిరిపోయాకే దాన్ని గుర్తిస్తుంటారంటున్నారు. హైబీపీ ఉంటే గుం డె ఆరోగ్యం, స్ట్రోక్, మూత్ర పిండాల వైఫల్యం వంటివి ప్రభావితం చేస్తుంది. రక్త నాళాల్లో పీడం చాలా ఎక్కువగా ఉన్నప్పుడు అధిక రక్తపోటు కింద లెక్కిస్తారు. రక్తపోటును క్రమం తప్పకుండా పర్యవేక్షించడం జీవితంలో భాగంగా అలవాటు చేసుకోవాల్సి ఉంటుంది. ఆరోగ్యకరమైన ఆహారం, ఆల్కహాల్, పొగాకు మా నేయ డం, ఒత్తిడి లేకుండా జీవించడం వంటి వల్ల అధిక రక్తపోటును అదుపులో ఉం చుకునే వీలుంటుంది. అధిక రక్తపోటుపై అవగాహన కల్పించేందుకు ప్రతీ యే డాది మే 17వ తేదీన వరల్డ్ హైపర్ టెన్షన్ డేగా నిర్వహిస్తున్నారు. హైపర్ టెన్షన్ కు సంబంధించిన పలు లక్షణాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యు లు వివరిస్తున్నారు.

### ●హైబీపీ లక్షణాలివీ...

తరుచుగా వచ్చే తలనొప్పి హైపర్ టెన్షన్‌కు ముందస్తు హెచ్చరిక అంటు న్నా రు. ఈ తలనొప్పులు సాధారణంగా తలకు రెండు వైపులా వణుకుతూ ఉంటా యి. ఎక్కువ కాలం పాటు అధిక రక్తపోటు కళ్లలోని రక్తనాళాలను దెబ్బ తీస్తుంది. కాబట్టి ఇది అస్పష్టమైన దృష్టి, డబుల్ దృష్టి లేదా ఆకస్మిక చూపు కోల్పోవడం వంటి దృష్టి సమస్యలకు దారితీస్తుంది. చికిత్స చేయకుండా వదిలేస్తే, ఇది తీవ్ర మైన దృష్టి సమస్యలను కలిగిస్తుంది. కొంతమంది వ్యక్తులలో తరుచుగా ముక్కు కారటం అధిక రక్తపోటుకు సంకేతం. ఇది సాధారణం కాదు కానీ ఒక సూచన, అధిక రక్తపోటు కారణంగా ముక్కులోని చిన్న పెళుసైన రక్తనాళాలు మరింత సు లభంగా చీలిపోతాయి. తరుచుగా ముక్కు నుంచి రక్తకారుతుంది. అధిక రక్తపో టు గుండెకు రక్తాన్ని సమర్థవంతంగా పంప్ చేయలేకపోవడంతో గుండెపై ఒత్తిడికి దారితీస్తుంది. అందువల్ల ఊపిరితిత్తుల్లో ద్రవం పేరుకపోయి శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిని కలిగిస్తుంది. కొంచెం పనిచేసిన తర్వాత కూడా శ్వాస ఆ డకపోవడానికి దారితీస్తుంది. నిరంతర అలసట అధిక రక్తపోటుకు మరొక సం కేతం. రక్తపోటు ప్రభావవంతంగా రక్తాన్ని పంప్ చేసే గుండె సామర్థ్యాన్ని ప్ర భా వితం చేస్తుంది. క్రియేటినిన్ పెరగడం, మూత్ర పిండాల పనితీరు క్షీణించడం కూడా అధిక రక్తపోటుకు సంకేతామని వైద్య నిపుణులు అంటున్నారు.

### వైద్యుల సలహాలు పాటించాలి

- డాక్టర్ శ్రీనివాస్,
డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ, జగిత్యాల

హైబీపీ లక్షణాలు గుర్తించిన వెంటనే సమీపంలోని వైద్యున్ని కలిసి ఆరోగ్య సలహాలు తీసుకోవాలి. వైద్యుని సలహాలు, సూచనలను తీసుకొని పాటించాలి. అ ధిక రక్తపోటును నిరంతరం అదుపులో ఉంచుకోవడానికి ప్రయత్నించాలి. మంచి ఆరోగ్య అలవాట్లను అలవర్చుకోవాలి. తగిన జాగ్రత్తలు తీసుకోకుంటే ముసు ముందు మరింత అనారోగ్య పరిస్థితులను ఎదుర్కోవలసి వస్తుంది. అప్రమత్తతో ఉండి ఆరోగ్య సలహాలు, సూచనలు పాటించాలి.

## శాతవాహన యూనివర్సిటీకి బీసీ వీసీని నియమించాలి



మాట్లాడుతున్న బీసీ సంఘాల నాయకులు

సుభాష్‌నగర్, మే 16: శాతవాహన యూనివర్సిటీకి బీసీ సామాజిక వర్గానికి చెందిన వైస్ చాన్స్‌లర్‌ను నియమించాలని బీసీ కులాల ఐక్యవేదిక, శాతవాహన యూనివర్సిటీ ప్రొటెక్షన్ అండ్ డెవలప్‌మెంట్ ఫోరం కో ఆర్డినేటర్ పెండాల శ్రీనివాస్, బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి కేశిపెద్ది శ్రీధర్ రాజు కోరారు. గురువారం నగరం లోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం యూనివర్సిటీలను నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. రాష్ట్రంలో ఉన్న విశ్వవిద్యాలయాలకు వెంటనే వైస్ చాన్స్ లర్లను నియమించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 2008లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం శాతవాహన యూనివర్సిటీని ఏర్పాటు చేసిందని తెలిపారు. అపుడు మైనారిటీ వర్గానికి చెందిన ఇక్బాల్ అలీని, 2012లో ఓసీ సామాజిక వర్గానికి చెందిన కడారు వీరారెడ్డిని వైస్ చాన్స్‌లర్‌గా నియమించిందన్నారు. 2021లో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ప్రొఫెసర్ మల్లేశ్‌ను వైస్ చాన్స్‌లర్‌గా నియమించిందన్నారు. ఇంతవరకు యూనివర్సిటీకి బీసీ సామాజిక వర్గానికి చెందిన వైస్ చాన్స్‌లర్ రాలేదన్నారు. ప్రస్తుత వీసీ మల్లేశ్ అవినీతి, అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరిపించాలని కోరారు.

రాష్ట్రంలో ఉన్న బీసీ జనాభా ప్రాతిపదికన 50 శాతానికి పైగా వైస్ చాన్స్‌లర్‌లను నియమిం చాలన్నారు. బీసీలను వైస్ చాన్స్ లర్లుగా నియమించాలని ప్రభుత్వా నికి వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు నాగుల కనకయ్య, సిరిసెట్టి రాజేశ్, బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు నారోజు రాకేశ్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బోయిని ప్రశాంత్, గాజా ప్రజ్వల్, జాగిరి సాగర్, కోట శ్యామ్‌కుమార్, అన్నమల్ల సురేష్, రవీంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లించాలి



మాట్లాడుతున్న జడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ



నిరసన దీక్ష చేస్తున్న బీఅర్ఎస్ నాయకులు

సిరిసిల్ల రూరల్/వేములవాడ టౌన్, మే 16 : పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన రోజు నుంచి రైతులకు క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి అమలు పర్చని రైతు వ్యతిరేక కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని జడ్పీచైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, సీనియర్ బీఆర్ఎస్ నేత ఏనుగు మనోహర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిరసిస్తూ గురువారం బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు నివాసంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమలుకు నోచుకోని హామీలను ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మాయమాటలు చెప్పుతూ ప్రజలను మోసం చేస్తోందన్నారు. క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనాస్ చెల్లిస్తామని ఎన్నికల్లో ఓట్లు వేయించుకుందన్నారు. ఓట్లు ముగిసిన తరువాత కేవలం సన్నవడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని చెప్పడం రైతులను మోసగించడమేనని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన కొద్దిరోజులకే ప్రభుత్వంపై ప్రజల్లో ఇంత వ్యతిరేకత రావడం కాంగ్రెస్ ప్రభుత్వానికే చెల్లిందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు రవి, దేవయ్య, బీఆర్ఎస్ పట్టణ కార్యదర్శి కందుల క్రాంతికుమార్, సహకార సంఘం అధ్యక్షులు ఏనుగు తిరుపతిరెడ్డి, బండ నర్సయ్య, రామ్మోహన్‌రావు ఎంపీపీ చంద్రయ్య, కౌన్సిలర్లు మారం కుమార్, నిమ్మశెట్టి విజయ్, గోలి మహేష్ నాయకులు తదితరులు ఉన్నారు.

● కాంగ్రెస్‌ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతోపాటు క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లించాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య డిమాండ్ చేశారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో గురువారం నిరసన దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఆగయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరుగ్యారంటీ హామీలను అమలు చేస్తామని ప్రజలను మోసం చేసిందన్నారు. పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన వెంటనే ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లిస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు సన్నవడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామనడం రాష్ట్ర రైతాంగాన్ని మరోసారి మోసం చేయడమేనన్నారు. రాష్ట్రంలో 90 శాతం రైతులు దొడ్డు ధాన్యాన్ని పండిస్తారని, ఈ విషయం తెలిసిన కూడా రాష్ట్ర ప్రభుత్వం ఎలా ప్రకటిస్తుందని ప్రశ్నించారు. సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామనడం ద్వారా తెలంగాణ రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి మోసం చేస్తోందన్నారు. ఓట్లు డబ్బాలో పడగానే కాంగ్రెస్ వాళ్లకు రైతుల అవసరం తీరిందన్నారు. రైతు బంధు ఇవ్వకపోగా రైతు భరోసా ఇవ్వకుండా రైతాంగాన్ని అన్ని రకాలుగా కాంగ్రెస్ మోసం చేస్తోందన్నారు. ఇప్పటికీ కేంద్రాల్లో ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, రైతులను అరిగోస పెడుతోందని అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సెస్ చైర్మన్‌చిక్కాల రామారావు, పవర్‌లూం టెక్స్‌టైల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గుడూరి ప్రవీణ్, అన్ని మండలాల అధ్యక్షులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు నాయకులు పాల్గొన్నారు.

**చందుర్తి :** వేములవాడలోనిబీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు ఇంటిలో చేపట్టిన నిరసన దీక్షకు చందుర్తి మండల బీఆర్ఎస్ నాయకులు గురువారం తరలి వెళ్లారు. బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు మరాటి మల్లిక్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, నాయకులు దుమ్మ అంజయ్య, భైరగోని రమేష్, బత్తుల కమలాకర్, రమేష్, నగేష్, తిరుపతి,రాజు, లచ్చిరెడ్డి, రాజయ్య, తిరుపతి, వేణు ఉన్నారు.

# రైతులపై బీఆర్ఎస్ కపట ప్రేమ



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

చందుర్తి, మే 16 : రైతులపై కపట ప్రేమతో బీఆర్ఎస్ దీక్షలు చేస్తున్నదే తప్ప మరేమీ లేదని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండల కేంద్రంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు రైతులపై మొసలి కన్నీరు కారుస్తున్నారన్నారు. గతంలో అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు రూ.10వేల పరిహారం ఇస్తామని చెప్పి మోసం చేశారన్నారు. రైతులు ఇబ్బందులు పడితే పట్టించుకోని బీఆర్ఎస్ నాయకులు అధికారం పోయాక రైతుల కోసం రావడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. రైతుబంధు రైతుల ఖాతాల్లో జమ చేశామని, పెన్షన్లు కూడా ప్రతి నెల ఇస్తున్నామని అన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో మూడో స్థానానికి పరిమితమవుతున్న బీఆర్ఎస్ తమ ఉనికిని కాపాడుకోవడం కోసం మాట్లాడుతున్నారన్నారు. కేటీఆర్ మాట్లాడుతూ వడ్లు కొనుగోలు చేయడం లేదనడాన్ని ఆయన విచక్షణకే వదిలేస్తున్నామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జిల్లా పరిధిలో మే 15 వరకు 86,364 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మే 15 వరకు 1,90,948 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. ఇప్పటి వరకు తాము లక్ష మెట్రిక్ టన్నుల ఎక్కువ కొనుగోలు చేశామన్నారు. ఎన్నికల్లో చెప్పినట్లుగానే వచ్చే వర్షాకాలం పంటకి రైతులకు రూ.500 బోనస్ ఇస్తామన్నారు. ఆగస్టు 15 వరకు రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి రుణమాఫీపై సాధ్యాసాధ్యాలను ఇతర రాష్ట్రాలకు వెళ్లి పరిశీలించాలని సూచించారన్నారు. బీజేపీకి చెందిన ఎంపీలు లక్ష్మణ్, కిషన్ రెడ్డి రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతుందనడం విడ్డూరమన్నారు. ఆర్థిక సంక్షోభానికి కారణం బీజేపీ, బీఆర్ఎస్ కాదా? అని ప్రశ్నించారు. సమావేశంలో జడ్పీటీసీ నాగం కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, నాయకులు గొట్టె ప్రభాకర్, మల్లేశం పాల్గొన్నారు.

# ఉపాధి కూలీల ఆందోళన

బీర్‌పూర్,మే 16: పని చేసే ప్రదేశంలో కనీస వసతులు కల్పించడం లేదని కూలీలు గురువారం ఆందోళన చేశారు. బీర్‌పూర్ మండలంలోని తుంగూర్ గ్రామంలో సుమారు 300 మంది ఉపాధి పనులు చేస్తున్నారు. గురువారం పనులు చేస్తున్న కూలీలకు తాగు నీరు ఇవ్వడం లేదని కూలీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఏర్పాటు చేసిన షేడ్ నెట్ గాలీ వానలకు కొట్టుకొని పోగా కనీసం మరొక షేడ్ నెట్ కూడా ఏర్పాటు చేయలేరని మండిపడ్డారు. బీర్‌పూర్ గ్రామంలో కూడా కూలీలకు సరైనా సౌకర్యాలు లేవని, సౌకర్యలు ఏ ర్పాటు చేసేందుకు అధికారులు చొరవ చూపాలని గ్రామస్తులు కోరారు. ఈ విషయమై ఏపీవో స్వప్నను వివరణ కోరగా కూలీలు పనులు చేస్తున్న సమయంలో తాగు నీటి సౌకర్యం, ప్రమాదవశత్తు ఏమైనా దెబ్బలు తగిలిన తక్షణ చికిత్స కోసం ఫస్ట్‌అయిడ్ బాక్స్, ఎండలో అలసిపోయిన కూలీలు సేద తీర్చు కోవడానికి(షేడ్‌నెట్) టెంట్లు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.